# రైతాంగానికి న్యాయమైన ధర లేకుండా ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నదెవరు?

**ఇటీవల** తెలుగు పత్రికలూ, వార్తాఛానెళ్ల రైతాంగానికి నాసిధరలు దక్కటం గురించీ, వినియోగదారులైన ప్రజలు అధిక ధరలు చెల్లించటం గురించీ చర్చలు సాగిస్తున్నాయి. తమ పంటలకు న్యాయమైన ధర దక్కనందుకు నిరసనగా అనేక ప్రాంతాల్లో రైతాంగం ఆందోళనలు సాగించటం (మధ్యప్రదేశ్‌లో పోలీసు కాల్పుల్లో 6గురు రైతుల మృతి)వల్ల ఈ సమస్య మరోసారి చర్చనీయాంశమైంది.

పర్యావరణ మార్పుల ఫలితంగా అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలతో నష్టాలను పొందటం, మారిన వాతావరణ పరిస్థితికి అనువుగా పంటల ఎంపిక లేకపోవటం, ఆధునిక సమాచార వ్యవస్థను వినియోగించుకుని మార్కెట్టునిబట్టి పంటలు వేయకపోవటం, ఆధునిక సాగుపద్ధతులు అనుసరించనందున దిగుబడులు నాసిగా వుండటం – ఫలితంగా మార్కెట్టుకు చేరుతున్న పంటలో బాగా ఎగుడుదిగుడులుండటం–తత్పర్యవసానంగా రైతులకిచ్చే ధరల్లోనూ, వినియోగదారులు చెల్లించే ధరల్లోనూ తీవ్రంగా వ్యత్యాసాలుండడం జరుగుతున్నదన్నది ఈ చర్చల సారాంశంగా వుంది. సూటిగానూ, అన్యాపదేశంగానూ కూడా ఈ చర్చలు రైతాంగంపై నెపం మోపుతున్నాయి.

ఈ సారాంశానికనుగుణంగానే ఈ చర్చలు చూపే పరిష్కార మార్గాలు కూడా వుంటున్నాయి. ఇంటర్నెట్‌ను గ్రామాలకు చేర్చి తాజా మార్కెట్టు స్థితిని రైతాంగానికి చేర్చటం, తగిన ధర వచ్చేవరకూ పంట నిల్వచేసుకొనే సౌకర్యాలు పెంచటం, ఏ పంటలు వేయటం లాభకరమో రైతాంగానికి తెలిపేందుకు విస్తరణ సేవలను పెంచటం, పంటలకు బీమాసౌకర్యం కల్పించటం, ఖర్చులు తగ్గించుకునేందుకు యాంత్రీకరణ చేపట్టడం వంటి సూచనలు చేస్తున్నాయి. ప్రభుత్వ విధానాలలో కొన్ని మార్పు చేయాలన్న సూచనలు కూడా వుంటున్నాయి. అవి ప్రధానంగా మార్కెట్టు ప్రైవేటుశక్తులకు ఎక్కువ స్వేచ్ఛనివ్వాలన్న దిశగా వుంటున్నాయి.

ఈ చర్చ అంతా వాస్తవాలకు దూరంగానూ, నేలవిడిచి సాముచేసేదిగానూ వుంది. ఎందుకంటే పుంజీడుమంది గుత్త వ్యాపారులూ, వారి కనువుగా ప్రభుత్వ విధానాలూ "కొనబోతే కొరివి అమ్మబోతే అడవి" సామెతను గుర్తుకు తెచ్చే నేటి పరిస్థితికి కారణం. ఇది నిరాధార ఆరోపణ కాదు. ప్రభుత్వశాఖల అధికారిక నివేదికలే దీనిని నొక్కి చెప్పాయి. అవేమిటో చూద్దాం.

యుపిఏ పాలనలో 2012లో ఉల్లిపాయ ధర మార్కెట్టులో కిలో 80–100 రూ॥లకు చేరాయి. దీనితో వచ్చిన ప్రజాందోళనతో ఉల్లిపాయల దిగుమతి, బ్లాక్ మార్కెటీర్లపై దాడులువంటి చర్యలతో పాటుగా కేంద్రప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికిచ్చింది. అనేక కమిటీల నివేదికలలాగానే ఇది కూడా బీరువాల్లో చేరి దుమ్ముపేరుకుపోయింది.

ఈ కమిటీ రూపొందించిన 'భారత ఉల్లి మార్కెట్టులో పోటీతత్వం అంచనా' అన్న నివేదిక సారాంశం ఇలా వుంది: (చూడండి : 5-11-2013 జనశక్తి) ఉల్లిమార్కెట్టుపై నలుగురైదురుగు బడా వ్యాపారులు గుత్తాధిపత్యం కలిగివున్నారు. దీనితో రైతాంగానికి అతి తక్కువధర చెల్లిస్తున్నారు; వినియోగదారులకు అతి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. విపరీత లాభాలను గడిస్తున్నారు. చివరి క్షణంలో ప్రభుత్వ జోక్యం ఏమాత్రం ఉపశమనాన్ని యివ్వటం లేదు. హడావుడి దిగుమతి అనుమతులు జాప్యానికీ, ఎక్కువ ధర చెల్లింపుకు దారితీస్తున్నాయి. కనుక గుత్తాధిపత్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి; ముందుగా కనీస మద్దతుధరను ప్రకటించాలి; సకాలంలో మార్కెట్లో జోక్యం చేసుకునేందుకు ప్రభుత్వ సేకరణ సంస్థలనూ, ప్రజాపంపిణీ వ్యవస్థనూ పటిష్టంచేయాలి, తదితర సూచనలు చేసింది.

రైతాంగాన్నీ, ప్రజలనూ గుత్తవ్యాపారులు దోచుకున్న తీరునూ, ప్రభుత్వంచూస్తూ ఊరుకున్న, ఫలితాలివ్వని హడావుడి ప్రకటనల రీతినీ ఈ నివేదిక తెలియజేస్తోంది. ఈ నివేదిక సూచనల అమలుకు యుపిఏ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వ నిర్వాకం కూడా దీనికి భిన్నంగా ఏమీలేదు. 2015 వేసవిలో కందులు, మినుములు వంటి పప్పుధాన్యాల ధరలు కిలో రూ॥65 నుండి 240కి చేరాయి. దీనితో ప్రజాందోళన రావటంలో మోడీ ప్రభుత్వం దొంగనిల్వదారులపై దాడులకు ఆజ్ఞాపించింది. పప్పుధాన్యాల దిగుమతులకు అనుమతినిచ్చింది. కందులు, మినుములకు కనీస మద్దతు ధరను పెంచింది. కందిపప్పు కేజి 130 రూ॥లకు తాను సరఫరా చేసి అమ్మించింది.

వినియోగదారుల వ్యవహారాల, ఆహార, ప్రజాపంపిణీశాఖ కేంద్రమంత్రి రామ్‌విలాస్‌పశ్వాన్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ "గత ఏడాదితో పోలిస్తే, పప్పుధాన్యాల ధరలు 12.68 శాతంనుండి 40.73 శాతం వరకూ పెరిగాయి. అననుకూల వాతావరణ మూలంగా పప్పుధాన్యాల దిగుబడులు తగ్గటమే ధరలు ఎక్కువగా పెరగటానికి ప్రధానకారణం" అని చెప్పారు.

ఈ ప్రకటనతో ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేసింది. పప్పుల ధరలు ఎక్కువలో ఎక్కువ 40 శాతం పెరిగాయని మంత్రిగారి ఉవాచ. కాగా ప్రజలు రెండున్నర రెట్లు ఎక్కువ ధర చెల్లించికొన్నారు. ప్రభుత్వం అమ్మించిన ధరే రెట్టింపు వుంది.

2014–15లో పప్పుధాన్యాల దిగుబడులు తగ్గటమే ధరల పెరుగుదలకు కారణమనటం కూడా వాస్తవం కాజాలదు. దేశంలో పప్పుధాన్యాలు 1.8 నుండి 1.9 కోట్ల టన్నుల మధ్య ప్రతి ఏడాదీ పండుతాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఏనాడూ 1.8 కోట్ల టన్నులకు తక్కువ పండలేదు. వానలు బాగా పడిన 2013–14లో 1.97 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. కాగా ధరలు పెరిగిన ఏడాది

దిగుబడి 1.84 కోట్ల టన్నులని మంత్రిగారే అంచనా చెప్పారు. దిగుబడి తగ్గుదల సాధారణ స్థాయిలోనే వుందితప్ప ధరలు విపరీతంగా పెరిగే స్థాయిలో లేదన్నది స్పష్టం.

దేశంలో పప్పుధాన్యాల వినియోగం ఏడాదికి 2.3 కోట్ల టన్నులుగా వుంటుంది. సగటున 30 నుండి 40 లక్షల టన్నులు దిగుమతులు సాగుతుంటాయి. ఈ దిగుమతులన్నీ ప్రైవేటు వ్యాపారులే చేస్తుంటారు. ఆ ఏడాది కూడా ప్రభుత్వం వీరి ద్వారానే దిగుమతి చేసుకుంది. వారు కోరిన ధరనే చెల్లించి, దానికి ఖర్చులు కలిపి మార్కెట్లో అమ్మించింది.

ఇక దొంగనిల్వలు కూడా సాకే. రెండు నెలలపాటు వివిధ ప్రభుత్వశాఖలు చేసిన 6077 దాడుల్లో బయటపడిన నిల్వలు దాదాపు 75వేల టన్నులు మాత్రమే. ఈ మాత్రపు నిల్వలు ధరల విపరీత పెరుగుదలకు కారణం కాబోవు.

మరి అసలు కారణమేమిటి?

ఈ దాడుల్లో అనేక కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటి పరిశీలించిన ఆదాయపు పన్నుశాఖ 2100 పేజీల నివేదికను తయారుచేసింది. దానికి "పప్పుల దిగుమతిదారులు, వ్యాపారుల గ్రూపు కేసుపై అంచనా నివేదిక" అని పేరుపెట్టింది. ఈ నివేదిక, మొత్తం పరిస్థితిని స్థూలంగా ఇలా పేర్కొంది:

"కొన్ని వ్యాపార, ద్రవ్యసంస్థలు కుమ్మక్కుతో సహకరించుకుని భారత్‌లో అసాధారణ ధరల పరిస్థితిని సృష్టించాయి. దేశంలోనూ, ప్రపంచంలోనూ పప్పుల నిల్వలను ఇవి పోగుచేసుకున్నాయి. భవిష్య వాణిజ్యాన్ని ఎక్కువగా సాగించి దేశంలోనూ ప్రపంచంలోనూ కృత్రిమ కొరతను సృష్టించాయి.... సేకరించిన సమాచారం మేరకు, సముద్రాంతర మార్కెట్టును ఏలుతున్న కొద్దిమంది వ్యాపారులు దేశంలోనూ, ఇతర దేశాలలోనూ పప్పులను కొనివేసి గుత్తాధిపత్యాన్ని పొందారు. దేశంలో ధరలను వారు నిర్ణయించి అతి తక్కువ ధరకు కొన్న పప్పు నిల్వలను ఎక్కువ ధరలకు అమ్ముకున్నారు. ఈ లాభాలలో దిగుమతి దారులకూ, హోల్‌సేల్ వ్యాపారులకూ కూడా వాటాలందాయి. ఈ లాభాలను ప్రభుత్వానికి చూపకుండా, పన్ను ఎగవేసి విదేశాలకు తరలించారు లేదా దేశంలోనే నల్లధనంగా దాచిపెట్టారు". (కందులు, మినుముల ధరల పెరుగుదల గుత్తాధిపత్యం ఫలితమే"– సుబీర్‌ఘోష్. ఇకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, జూలై నెల వెబ్‌ఎక్స్‌క్లూజివ్‌లో ప్రచురిత వ్యాసం).

ఇదండీ అసలు సంగతి. కొన్ని విదేశీకంపెనీలు, దేశీయ గుత్తవ్యాపారులు కలిపి రైతులనుండి తక్కువ ధరకు కొన్నారు. కృత్రిమ కొరతను సృష్టించి ఎక్కువ ధరలకు ప్రజలకు అమ్మారు. గడించిన సూపర్ లాభాలకు పన్ను ఎగవేసి విదేశాలకి తరలించారు. ఇదంతా రైతాంగానికి ప్రపంచమార్కెట్టు ధరలు అందుతాయని ఊదరపెట్టి అనుమతించిన భవిష్యవాణిజ్యంవల్ల సాధ్యపడింది. ఇదంతా తెలిసికూడా ప్రభుత్వం ఈ గుత్తాధిపతులనుండే పప్పులు కొని అధిక ధరకు అమ్మించింది.

ఆదాయపు పన్నుశాఖ ఇంతటితో ఆగలేదు. ఆ గుత్తవ్యాపారుల పేర్లుకూడా బయటపెట్టింది. శ్రేణి ఒకటి: అంతర్జాతీయ మార్కెట్టును ప్రభావితం చేయగల బహుళజాతి కంపెనీలు–గ్లెన్‌కోర్ గ్రూపు; ఇటిజి గ్రూపు; ఎడెల్‌వీస్ గ్రూపు. రెండవశ్రేణి: దేశంలో పప్పులు కొని నిల్వచేసిన, ఒకటవ శ్రేణి పప్పులను దేశంలో అమ్మినవారు: జిందాల్ గ్రూపు; వికాస్‌గుప్తా సుపీరియర్ గ్రూపు; మనోజ్ అగర్వాల్; ఎస్‌వి ఆగ్రోట్రేడ్; షార్ప్‌మింట్ గ్రూపు. మూడవ శ్రేణి : సూపర్ లాభాలను తగ్గించి చూపి పన్నులు ఎగవేసేందుకు దొంగ బిల్లులు ఇచ్చేవారు. మొదటి, రెండవ శ్రేణికి బినామీలు వీరు : మనోజ్ అగర్వాల్, రిద్ధిసిద్ధి ఇంపెక్స్; పార్థ ఇంటర్నేషనల్; గాయత్రిమా; గన్ఎంటర్‌ప్రైజెస్; ఛార్లెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. వీటిలో ముఖ్యమైన కంపెనీల వివరాలు చూద్దాం.

గ్లెన్‌కోర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ : ఇది ఆంగ్లోస్విస్ బహుళజాతి కంపెనీ. ఖనిజాలు, సరుకుల వాణిజ్యంలోని ప్రపంచస్థాయి పెద్దకంపెనీలలో ఇదొకటి. ఫార్చ్యున్ 500 కంపెనీల లిస్టులో దీనిది 14వ స్థానం. గ్లెన్‌కోర్ గ్రెయిన్ ఇండియా లిమిటెడ్ అన్న అనుబంధ కంపెనీ ద్వారా భారత్‌లో దీని కార్యకలాపాలు సాగుతున్నాయి. దీనికే మరో అనుబంధ కంపెనీ–అగ్రికోర్ కమోడిటీస్ ప్రైవేట్ లిమిటెడ్–వుంది. ఈ రెండిటికీ ఒకడే డైరెక్టరు. పప్పువ్యాపారుల సంఘమైన 'ఇండియన్ పల్సెస్ అండ్ గ్రెయిన్స్ అసోసియేషన్'కు ఇతనే ఛైర్మన్. గ్లెన్‌కోర్ – ఆదానీల మిలాఖత్ కంపెనీ భారత్‌లో ఇంధన వాణిజ్యం కూడా చేస్తున్నది.

ఈ కంపెనీపై చేసిన దాడుల్లో దొరికిన పత్రాల ఆధారంగా, గ్లెన్‌కోర్ గుత్తాధిపత్యాన్ని, ధరల నియంత్రణను పన్నుల ఎగవేతను సాగించిన విధానాన్ని వివరాలతో సహా పేర్కొన్న ఆదాయపు పన్నుశాఖ నివేదిక చివరికి ఇలా అంది : "వాణిజ్యంలో గుత్తాధిపత్యంతో భారత పేద వినియోగదారుడిని పీల్చి పిప్పిచేసి, ఖజానాకు పన్ను చెల్లించకుండా ఎగవేసిన ఈ ప్రపంచస్థాయి కంపెనీ అనైతిక, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడటం విచారకరం. గ్లెన్‌కోర్ నాయకత్వంలోని ముఠా (కార్టెల్)దేశ ఆర్థిక భద్రతకు తీవ్ర ప్రమాదంగా వుంది". (సుబీర్‌ఘోష్ వ్యాసం నుండి)

ఇటిజి గ్రూపు : దీని అసలు పేరు ఎక్స్‌పోర్టు ట్రేడింగ్ గ్రూపు. వ్యవసాయ సరుకుల వాణిజ్యంలో ఆఫ్రికా, మయన్మార్‌లలో గుత్తాధిపత్యం కలిగి వున్న ఈ కంపెనీ ప్రధాన కార్యాలయం బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో వుంది. వ్యవసాయ సరుకుల సేకరణ, ప్రాసెసింగ్, నిల్వలు, పంపిణీ, వాణిజ్యం కార్యకలాపాలను భారత్, ఉత్తర అమెరికా, చైనా, ఆగ్నేయాసియాలలో సాగిస్తున్నది. భారత్‌లో దీని అనుబంధ కంపెనీలు: ఇటిజి ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, ఇటిజి కమోడిటీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌ఫీల్డ్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇటిసి ఆగ్రో ప్రాసెసింగ్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఇటిజి ఆగ్రో ప్రాసెసింగ్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్. ఇంతేకాక భారత్‌లో పెద్ద బిస్కట్ కంపెనీ పార్లేతో మిలాఖత్తు కంపెనీని దుబాయ్‌లో పెట్టి గల్ఫ్ దేశాలలో బిస్కెట్ వ్యాపారం చేస్తున్నది.

దాడుల్లో దొరికిన పత్రాల ఆధారంగా ఆదాయపు పన్నుశాఖ నివేదిక గ్లెన్‌కోర్, ఇటిజి గ్రూపులు ఒక అవగాహనకు వచ్చి పోటీపడకుండా నివారించుకొనే ఒప్పందం చేసుకున్నాయనీ, దానితో ఇటిజిలో 51శాతం వాటాలను 16.28 కోట్ల డాలర్లకు

గ్లెన్‌కోర్ కొన్నదనీ, తత్పర్యవసానంగా ప్రపంచంలోనే పెద్ద కంపెనీ అయినప్పటికీ, 2015లో వేలాది కోట్ల రూ॥ల వాణిజ్యం చేసినప్పటికీ పన్నులు చెల్లించలేదనీ చెప్పింది.

ఎడెల్‌వీస్ గ్రూపు : ద్రవ్య సేవలలో ప్రధానంగా వున్న భారత పెద్ద కంపెనీలలో ఒకటి. పెట్టుబడి మార్కెట్, రుణాలు, ఆస్థి నిర్వహణ, జీవితబీమా, సరుకులరంగంలో వుంది. దీనికి 45 అనుబంధ కంపెనీలున్నాయి. వీటిలో పప్పుల సంక్షోభంతో సంబంధం వున్నవి : ఎడెల్‌వీస్ కమోడిటీస్ సర్వీసెస్ లిమిటెడ్, ఎడెల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, ఎడెల్‌వీస్ ట్రేడింగ్ అండ్ హోల్డింగ్ లిమిటెడ్. ఇది గ్లెన్‌కోర్, ఇటిజిలకు డమ్మీగా వ్యవహరించిందని అనుమానించడానికి ఆధారాలు ఉన్నాయని ఆదాయపు పన్ను శాఖ భావించింది.

(మూడు పెద్ద కంపెనీలు కుమ్మక్కయి గుత్తాధిపత్యంతో రైతాంగాన్నీ, ప్రజలనూ దోచుకున్నాయన్న ప్రభుత్వశాఖ అంచనావరకే పేర్కొన్నాము. అలాగే రెండవ, మూడవ శ్రేణి కంపెనీల వివరాలను కూడా పేర్కొనలేదు. ఇవి మూడు పెద్ద కంపెనీలతో కుమ్మక్కు అయి వ్యవహరించాయి. వివరాలకు ఇపిడబ్ల్యులో సుబీర్‌ఘోష్ వ్యాసం చూడండి)

తర్వాతేం జరిగింది? 2016లో వర్షాలు బాగా పడటంతో మహారాష్ట్ర, కర్ణాటకల్లో పప్పుధాన్యాల పంట బాగా దిగుబడినిచ్చింది. ప్రభుత్వం దిగుమతి చేసుకున్న 20 లక్షల టన్నుల పప్పులు ఏప్రిల్ నాటికి గోదాముల్లోకి వచ్చి కూర్చున్నాయి. కనీస మద్దతుధరకు పప్పులు కొనమన్న ప్రభుత్వ జీవోకు 2016 ఏప్రిల్‌తో కాల పరిమితి ముగిసింది. నాఫెడ్ కొనుగోళ్ళు ఆపివేసింది. పప్పుల సీజన్ మొదలయ్యేసరికి ధరలు రికార్డుస్థాయికి పడిపోయాయి. క్వింటాలుకు రూ. 3950 నుండి 4050 మధ్య రైతాంగానికి ధర వచ్చింది. అంటే కేజి 39-40 రూ॥లు మాత్రమే రైతుకు దక్కింది. కాగా చిల్లర మార్కెట్లో 2016 జూన్ తర్వాత కందిపప్పు కేజి 170 రూ॥లు, మినుములు కేజి 190 రూ॥లు అమ్మారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం 2016 జూన్‌లో యుద్ధప్రాతిపదికన పప్పుధాన్య సేకరణ చెయ్యాలని సూచించాడు. పప్పుల ధరలు తగ్గుముఖం పట్టలేదని 2016-17 ఆర్థిక సర్వే కూడా పేర్కొంది. 2016 సీజను ముగిసేసరికి తెగనమ్ముకోలేక సగం పంట రైతుల వద్దనే వుండి పోయిందని మార్కెట్టు వర్గాల అంచనా (బిజినెస్ స్టాండర్డ్ జనవరి 12, 2017).

దిగుబడులు బాగా వున్నా, తగ్గిపోయినా రైతాంగానికి న్యాయమైన ధర దక్కలేదు. అలాగే ప్రజలు రెండురెట్లకు పైగా ఎక్కువధర పెట్టి కొన్నారు. ఈ దారి దోపిడీకి మూలం మూడు పెద్ద కంపెనీలు కుమ్మక్కయి ముఠాగా ఏర్పడి రైతాంగానికి ధరలు తగ్గించాయి. ప్రజల జేబులు ఖాళీ చేశాయి. ప్రభుత్వ విధానాలు దీనికే తోడ్పడ్డాయి. పరిస్థితి తెలిసి కూడా ఎలాంటి నివారణా చర్యలూ తీసుకోలేదు. అది తీసుకున్న ప్రదర్శనాత్మక చర్యలు కూడా (అకాల దిగుమతి, సమయం తప్పిన సేకరణ) పరిస్థితి దిగజారడానికి తోడ్పడ్డాయి.

ఈ కఠోర అనుభవం నుండి నేర్చుకోవటానికి భారత పాలకవర్గాలు సిద్ధంగా వున్నాయా? లేదనే చెప్పాలి. ఎందుకంటే దోపిడీవర్గాల కొమ్ముకాయటానికి అది కంకణం కట్టుకుని వుంది.

దేశ, విదేశీ బడా కంపెనీల గుత్తాధిపత్యాన్ని నివారించే చర్యలు తీసుకొమ్మని ప్రభుత్వ నియమిత కమిటీలే ఘోషిస్తుండగా, వ్యవసాయ మార్కెట్టు యార్డుల ప్రైవేటీకరణకు చట్టాన్ని తీసుకొచ్చింది బిజెపి ప్రభుత్వం. ఇలా చేయమని కాంగ్రెసు ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించగా అవి చర్యలు తీసుకోనందున, రాష్ట్ర చట్టాలు రద్దుచేసి కేంద్ర చట్టాన్ని తెచ్చేందుకు పూనుకుంది బిజెపి. అంటే ఆచరణలో ఈ గుత్తాధిపతులకే వ్యవసాయ మార్కెటుయార్డులను దఖలు పరుస్తారు.

ఆహార సబ్సిడీ మోయరాని భారమైందన్న పాట గత మూడు దశాబ్దాలుగా సాగిస్తూ, సేద్య అవసర సరుకుల ధరలన్నీ పెంచివేస్తూ వచ్చిన పాపాన్ని పాలకవర్గ ముఠాలు రెండూ సమానంగా పంచుకున్నారు. ప్రభుత్వ ధాన్యసేకరణ సంస్థలనూ, ప్రజా పంపిణీ వ్యవస్థను నెమ్మదిగా నిర్వీర్యపరిచే 'పుణ్యకార్యం' కూడా ఇద్దరూ భక్తి శ్రద్ధలతో చేశారు. 2015లో శాంతకుమార్ కమిటీ చేసిన ధాన్యసేకరణ ఆపివేత, ప్రజాపంపిణీ వ్యవస్థ మూసివేత సూచనలను ఆమోదించి, అమలు పరిచిన బిజెపి ప్రభుత్వం సమానులలో కూడా తానెక్కువ సమానురాలనని నిరూపించుకుంది.

వ్యవసాయోత్పత్తుల మార్కెట్టును గుత్తాధిపతుల చేతుల్లో పెడతారు. వాటి సేకరణ నుండి ప్రభుత్వం తప్పుకుని రైతాంగాన్ని గుత్త వ్యాపారుల ముందు నిస్సహాయులుగా నిలబెడతారు. చౌకధరల దుకాణాలను మూసివేసి ఇక ప్రజలకు గుత్తాధిపతులు నిర్ణయించిన అధిక ధరను చెల్లించటం తప్ప మరో దారి లేకుండా చేస్తారు. గుత్తాధిపతుల కబంధ హస్తాలను పటిష్టపరచటమే ప్రభుత్వ లక్ష్యమనటానికి ఈ రెండు ప్రధాన ఉదాహరణలూ చాలు.

బహుళజాతి కంపెనీలైన బేయర్, ఐటిసిలు వాణిజ్యపంటల సేకరణ, ప్రాసెసింగ్, వాణిజ్యంలోకి ప్రవేశించాయి. గుంటూరుజిల్లాలో యివి పొగాకుతో పాటు మిర్చి, పసుపు పంటలను సేకరిస్తున్నాయి. ఐటిసి నూనెగింజల కొనుగోలు ప్రాసెసింగ్ వాణిజ్యంలో వుంది. ఈ ఏడాది మిర్చికి, పసుపుకు ప్రధాన కేంద్రమైన గుంటూరులో వీటి ధరలు విపరీతంగా తగ్గి రైతాంగం నష్టపోయారు. పొగాకు గుత్తాధిపత్యంతో ఐటిసి, పొగాకు రైతుల జీవితాలతో ఆటలాడుకున్న ఐదు దశాబ్దాల అనుభవాన్ని చూసినవారికి మిర్చి, పసుపు పంటలలో ఈ ఏడాది సంక్షోభంలో వీటి పాత్ర వుందన్న భావన కలుగుతున్నది.

రైతాంగాన్ని, ప్రజలను గుత్తాధిపతుల ధృతరాష్ట్ర కౌగిలిలోకి నెట్టే విధానాలతో రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న, ప్రజల ఆర్థిక సాధికారతను నెలకొల్పుతానన్న మోడీ వాగ్దానాలు ప్రజలను మభ్యపరిచే వాగాడంబరం తప్ప మరేదీ కాబోదన్నది స్పష్టం.

ooooo